నమస్తే తెలంగాణ

వికారాబాద్

I హైదరాబాద్, మంగళవారం 16 ఏప్రిల్ 2024 VIKARABAD




రాజేంద్రనగర్ ఆర్‌వో కార్యాలయంలో ఏఆర్‌వో, ఏఈఆర్‌వోలతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డిజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

## నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**రంగారెడ్డిజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక**

షాబాద్, ఏప్రిల్ 15: నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డిజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్ ఆర్‌ఓ కార్యాలయంలో ఏఆర్‌ఓ, ఏఈఆర్ ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 18వ తేది నుంచి చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలకు సూచించారు. నామినేషన్ స్వీకరించే రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వందమీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇతరులను ఎవరిని ప్రవేశించకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ వేసే వారితో పాటు మరో నలుగురిని అనుమతించాలని తెలిపారు. ఉదయం 11గంటలకు ముందు, మధ్యాహ్నం 3గంటల తర్వాత నామినేషన్లు స్వీకరించకూడదని తెలిపారు. నామినేషన్ల స్క్రూట్నీని ఎప్పుడు ఎక్కడ నిర్వహిస్తారనే సమాచారం అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫింగ్ మధ్య చేపట్టాలన్నారు. రిటర్నింట్ అధికారి కార్యాలయానికి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, అదే విధంగా అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. నామినేషన్లు దాఖలైనప్పటి నుంచి అభ్యర్థుల వ్యయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల వ్యయ వివరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, డీసీపీ శ్రీనివాస్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ డీఎస్పీ ఇంటి ముందు భార్య ఆందోళన

**మరో మహిళ తో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పట్టించుకోవడం లేదని ఆరోపణ**

తుర్కయంజాల్, ఏప్రిల్ 15: మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పట్టించుకోకుండా విడాకులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాడని తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి పంచవటి హోమ్స్ కాలనీలోని ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ ఇంటి ముందు ఆయన భార్య జ్యోతి ఆందోళన చేపట్టింది. మెదక్ ఏఆర్ డీఎస్పీ తుర్కయంజాల్ సాయి పంచవటి హోమ్స్‌లోని తన సొంత ఇంటిలో కొద్ది సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాడు.ఈ క్రమంలో రంగనాయక్ దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆయన భార్య జ్యోతి గత సంవత్సరం నవంబర్‌లో మిర్యాలగూడ సమీపంలోని తన తల్లి ఇంటికి వెళ్లి రంగనాయక్‌పై నల్గొండ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ జరుగుతున్న నేపథ్యంలో సోమవారం రంగనాయక్ భార్య జ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయక్ ఇంటికి చేరుకుంది. ఆమెను పైకి రాకుండా మెట్ల వద్ద ఉన్న గేటుకు తాళం వేయడంతో జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయక్ ఇంటి ముందు ఆందోళనకు దిగి 100 నంబర్‌కు డయల్ చేయడంతో ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.పోలీసుల ప్రమేయంతో రంగనాయక్ ఇంటి గేటు తాళాన్ని తీసి తన భార్యను ఇంటిలోనికి రానిచ్చాడు.


ఈ సందర్భంగా రంగ నాయక్ భార్య జ్యోతి మాట్లాడుతూ తన భర్త ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనకు విడాకులు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాడని తనకు విడాకులు వద్దని తన భర్త,పిల్లలు మాత్రమే తనకు కావాలని కోరింది.తన భర్తతో ఉన్న మహిళను ఇంటి నుంచి పంపించి తనకు న్యాయం చేయాలని ఆమె ఆవేదనను వ్యక్తం చేసింది. తనకు న్యాయం జరిగేలా అధికారులు సహకరించాలని ఆమె కోరింది.



ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ ఇంటి ముందు ఆందోళన చేపడుతున్న రంగనాయక్ భార్య జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి



**రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో ప్రజలకు తప్పని తిప్పలు**

**బీజేపీ, కాంగ్రెస్‌లతో ప్రజలు ఒరిగిందేమీలేదు**

**పదేండ్లలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది శూన్యం**

**కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు షురూ**

**'పాలమూరు' పనులను పక్కన పెట్టిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి**

**లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# బీజేపీ ధరల మోత.. కాంగ్రెస్ హామీల ధోకా

**పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుదాం..**

కొడంగల్, ఏప్రిల్ 15 : 'కాంగ్రెస్, బీజేపీలతో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీలేదు.. గడిచిన పదేండ్లలో కేంద్ర సర్కార్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమీలేదు.. మరోవైపు ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో జనానికి కష్టాలు మొదలయ్యాయి.. నాలుగు నెలల్లోనే రేవంత్ పాలనపై ప్రజలకు విసుగు పుట్టింది.. కొని తెచ్చుకొన్న కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో నిర్వహించిన మహబూబ్‌నగర్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాణాలకు తెగించి సాధించుకున్న తెలంగాణను రక్షించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందుకోసం పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని లక్షా 49వేల ఎకరాలకు సాగునీరందే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో కరివెన ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడంతోపాటు కాలువల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. కేంద్రంలో బీజేపీ పాలన.. రాష్ట్రంలో పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎంత తేడా ఉందో ప్రజలు ఓ సారి ఆలోచించుకోవాలన్నారు. బీజేపీ గుడి కట్టించాం అని ప్రచారం చేసుకుంటున్నదని, తెలంగాణలో కేసీఆర్ నిర్మించిన యాదాద్రి వంటి ఎన్నో దేవాలయాలు, బడులు, సాగునీటి ప్రాజెక్టులు వారికి కనిపించవా అన్ని ప్రశ్నించారు. నేడు జీఎస్టీ పుణ్యమా అని నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దేశంలో 155 మెడికల్, 177 నర్సింగ్ కళాశాలలను కేంద్రం మంజూరు చేస్తే, అందులో తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. దీన్నిబట్టి తెలంగాణపై బీజేపీకి ఏమాత్రం బాధ్యత ఉందో అర్థమవుతుందన్నారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందని, అన్ని రంగాల్లో ప్రగతి సాధించి దేశంలో తెలంగాణ ఓ ప్రత్యేక స్థానాన్ని పొందినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారెంటీలు, నోటికొచ్చిన 420 ఊకదంపుడు వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటికీ ఏ ఒక్క గ్యారెంటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, నేటి వరకు రైతు బంధు, రైతు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, కేసీఆర్ కిట్, వంటి పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే హక్కు లేదని, రెండు పార్టీలను ప్రజలు నిలదీసే రోజు వచ్చిందని గుర్తు చేశారు. కేంద్రలో తెలంగాణకు రావాల్సిన అన్ని నిధులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలంటే ఎంపీలుగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కేసీఆర్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, మాజీ స్పోర్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### బీజేపీ, కాంగ్రెస్‌లను నిలదీయండి..

**– బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి నిధులివ్వకుండా ప్రగతిని అడ్డుకుంటే, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై ఓట్ల కోసం వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీయాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలను అందుకొని ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ చీకటిమయంగా మారుతుందన్న సమైక్య పాలకుల మాటలు.. నేడు రేవంత్‌రెడ్డి పాలనలో నిజమవుతున్నాయన్నారు. పార్లమెంటులో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఏనాడూ తెలంగాణ అభ్యున్నతికోసం మాట్లాడలేదని, కనీసం ఒక్క మెడికల్ కళాశాలను కూడా మంజూరు చేయలేదన్నారు.

### బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి..

**– మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**



పార్లమెంట్ ఎన్నికల్లో 50 వేలకు పైగా మెజార్టీ తగ్గకుండా ఉన్నప్పుడే కేంద్రం నుంచి అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సర్వేలు, ఇంటలిజెన్స్ రిపోర్టు ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి అధికంగా సీట్లు వస్తాయని తెలుసుకున్న రేవంత్‌రెడ్డి ఓటమి భయంతో పూటకో మాట మాట్లాడుతున్నట్లు ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం కొడంగల్ అభివృద్ధికి రూ.4వేల కోట్లను మంజూరు చేసి అభివృద్ధి సాధించిందన్నారు. ఎన్నికలకు ముందు మరో రూ.900 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

### ఆందోళనలో రైతులు..

**– మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



కేసీఆర్ హయాంలో వ్యవసాయం ఓ పండుగలా సాగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే కరెంటు లేక, సాగునీరు లేక ఎండుతున్న పంటలతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అన్నదాతలను కాంగ్రెస్ నిండా ముంచిందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలిచ్చిన ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలు గుర్తించారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌తోనే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించి బీఆర్ఎస్ సత్తాని చాటేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు.

### కేసీఆర్ రైతు పక్షపాతి..

**– మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**



కేసీఆర్ రైతు పక్షపాతి అని, అందుకే పదేండ్ల పాలనలో రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. పెట్టుబడి సాయం, నీరు, నాణ్యమైన కరెంట్ అందించి రైతును రాజు చేశారన్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని పూర్తి చేయడంతో పాటు ఊహకు అందని ఎన్నో అద్భుత పథకాలను అమలు చేశారన్నారు. కేసీఆర్ ఆలోచన విధానం ఎట్లుండే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఆలోచన ఏవిధంగా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## పంటలను కాపాడుకునేందుకు ఆపసోపాలు



ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన పైపులు,మోటర్లు

**తూముకు నీళ్లందక మోటార్లతో నీటి తరలింపు**

**రైతులకు తప్పని సాగునీటి పాట్లు**

బొంరాస్‌పేట, ఏప్రిల్ 15 : మండలంలోని ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు కింద యాసంగిలో వరి పంటలు సాగు చేసుకున్న రైతులు వాటిని కాపాడుకోవడానికి అపసోపాలు పడుతున్నారు. పంటలకు నీరందించడానికి అన్నదాతలు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. కొడంగల్ నియోజవర్గంలో ఏకైక సాగునీటి ప్రాజెక్టుగా పేరుగాంచిన కాకరవాణి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఏటా సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఎగువన రైతులు ప్రాజెక్టు లోపలి భాగం నుంచి అక్రమంగా నీటిని తరలించి పంటలను సాగు చేస్తుండడంతో ప్రాజెక్టు కింద పంటలు సాగు చేసుకున్న రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఏర్పుమళ్ల గ్రామానికి సమీపంలో కాకరవాణి వాగుకు అడ్డంగా 1972లో ప్రాజెక్టు నిర్మించడానికి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు కింద 1260 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిర్మించారు. ప్రతి సంవత్సరం 600 ఎకరాలకు మించి ఆయకట్టు సాగుకు నోచుకోవడం లేదు. ఏటా ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పారుతున్నా యాసంగిలో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు ఎగువ భాగంలో రైతులు ప్రాజెక్టులో మోటర్లు పెట్టి పైపుల ద్వారా నీటిని తరలించి ఏటా సుమారు వంద ఎకరాలకు పైగా వరి పంటలను సాగు చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గి ప్రాజెక్టు దిగువన ఉన్న పొలాలకు సాగునీరు అందడం లేదు. ఈ యాసంగిలో ప్రాజెక్టు కింద రైతులు 200లకుపైగా ఎకరాలలో వరి పంటలను సాగు చేశారు. ప్రాజెక్టు ఎగువన అక్రమంగా నీటిని తరలించుకుపోవడంతో తూముకు నీళ్లు అందక ప్రాజెక్టు కింద పంటలు సాగు చేసిన రైతులు సాగునీరు అందించడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలు చేతికి వచ్చే దశలో నీరందే పరిస్థితి లేదు. దీంతో రైతులు మోటర్లు పెట్టి పైపుల ద్వారా ప్రాజెక్టులోని నీటిని తూములోకి తరలించి కాలువ ద్వారా పొలాలకు పారబెడుతున్నారు. మోటర్లు, పైపుల కోసం ఒక్కో రైతు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. అదనపు భారమైనా పంటలను కాపాడుకోవడానికి వేరే దారి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువన అక్రమ నీటి తరలింపును అరికడితే సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని రైతులు భావిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలోని కాకరవాణి ప్రాజెక్టు రైతుల ఇబ్బందులపై దృష్టిసారించి సాగునీటి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



మోటర్లు, పైపుల ద్వారా నీటిని తూములోకి మళ్లిస్తున్న దృశ్యం